క్లుప్తంగా

నేటి నుంచి మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

కొయ్యూరు: మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం బుధవారం నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' పేరిట ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు రాజేంద్రపాలెం వైద్యుడు హేమంత్ చౌదరి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజేంద్రపాలెం, రావణాపల్లి, బూదరాళ్ల, శరభన్నపాలెం, మర్రివాడ, వెలగలపాలెం, కొయ్యూరు, నడింపాలెం, చీడిపాలెం, అంతాడ, కొండగోకిరి, మంప, బంగారంపేట, రేవళ్లలో ఈ శిబిరాలను బుధవారం నుంచి వరుసగా నిర్వహిస్తామన్నారు. సీహెచ్‌వో ప్రశాంత్, పీహెచ్ఎన్ భాగ్యవతి, హెచ్‌వీలు లక్ష్మి, భూలోక, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

18, 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు రూరల్: జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో మోదమాంబ కాలనీ, పాత బస్టాండ్, యూనియన్ బ్యాంక్ ఏరియా, ఫారెస్ట్ క్వార్టర్స్ ఏరియాలో విద్యుత్ తీగలకు ఆనుకుని ఉన్న చెట్లుకొమ్మలు, విద్యుత్ వైర్లు సరి చేసే పనుల నిమిత్తం ఈ నెల 18, 19న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మించాలి

సీలేరు: గిరిజన రైతుల సౌకర్యార్థం ఏజెన్సీలో కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మించాలని డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పండించే పంటలు దాచుకోవడానికి సరైన నిల్వ గోదాములు లేక రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారన్నారు. ముఖ్యంగా జీడిపిక్కలు, రాజమా, కాఫీలు, మిరియాలు, చింతపండు, అడ్డాకులు, తేనే, పసుపు ఇతర ముఖ్య పంటలను మైదాన ప్రాంతాలకు తీసుకొని వెళ్లి నిల్వ చేసుకునే స్తోమత లేక గిరిజన రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు మేలు జరిగేలా చింతపల్లి, పాడేరు, అరకు ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బీఈడీ అధ్యాపకుడు విజయకుమార్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న విజయకుమార్

రంపచోడవరం: రంపచోడవరానికి చెందిన తెలుగు అధ్యాపకుడు గోపాల విజయకుమార్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును ఏపీఎంపీఏ అందజేసింది. స్థానిక లెనోరా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఆయన తెలుగు అధ్యాపకుడుగా పనిచేస్తున్నారు. ఇటీవల విజయవాడలోని సిద్ధార్థ బీఈడీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను అధ్యాపకులు అభినందించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

గంగవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి అన్నారు. ఎండపల్లి గ్రామంలో రూ.32 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ కార్యాలయం భవన నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికులు నాణ్యతతో పనులు చేయించుకోవాలని సూచించారు. పలువురు ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు తీసుకెళ్లారు. ఎండపల్లి సర్పంచ్ బి.రామలక్ష్మి, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే కోసూరి కాశీ విశ్వనాథ్, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, ముల్లేరు సొసైటీ చైర్‌పర్సన్ పాము అర్జున, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

19న ముంచంగిపుట్టులో మెగా వైద్య శిబిరం

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో ఈ నెల 19న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కిముడు గీతాంజలి తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ స్వస్త నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య నిపుణులతో సీహెచ్‌సీలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళా వైద్య నిపుణులు, అష్టమాలజీ, చిన్న పిల్లల వైద్య నిపుణులతో పాటు స్క్రీనింగ్స్, కిడ్నీ, లివర్, హిమోగ్లోబిన్ వంటి రక్త పరీక్షలు చేస్తామన్నారు.

నిలిచిన సేవలు.. తప్పని అవస్థలు

- ఏజెన్సీలో అస్తవ్యస్తంగా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్
- రీచార్జ్ చేసుకుంటున్నా వినియోగించలేని దుస్థితి
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు


ఇబ్బందులు పడుతున్న ఇంటర్నెట్ షాపు నిర్వాహకుడు


చట్లశిల్పలో సక్రమంగా పనిచేయని బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్

సీలేరు: ఏజెన్సీ ప్రాంతంలో బీఎస్ఎన్ఎల్ సేవలు అధ్వానంగా తయారయ్యాయి. సెల్ టవర్ నిర్వహణను గాలికి వదిలేయడంతో సిగ్నల్ వ్యవస్థ దెబ్బతింది. దీంతో ఒక ఫోన్ నుంచి మరో ఫోన్‌కి రింగ్ అవ్వాలంటే చాలా సమయం పడుతుంది. కొన్ని సందర్భాలలో పక్కనే ఫోన్ ఉన్న స్విచ్ ఆఫ్ అని వస్తుంది. ఇలా ఏజెన్సీ అంతటా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని ఆరోపణలు వస్తున్నాయి.

బీఎస్ఎన్ఎల్ పనిచేయదు.. జియో ధరలు ఎక్కువ

ఏజెన్సీలో సెల్‌ఫోన్ వాడే ప్రతి వినియోగదారుడు రీచార్జ్ చేసుకుంటున్నా ఫలితం ఉండడం లేదు. బీఎస్ఎన్ఎల్, ఫైబర్ నెట్, మొబైల్ సిగ్నల్‌కు అన్నిటికీ ఒకటి అనుసంధానం కావడంతో రెండింటిలో ఏది పోయినా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. నెట్‌వర్క్ లేక డిజిటల్ పేమెంట్లు, బ్యాంకు సేవలు, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాలు, ఆధార్ కేంద్రాల్లో రోజుల తరబడి సక్రమంగా సేవలు అందడం లేదు.

వర్షాలు పడితే బీఎస్ఎన్ఎల్ వ్యవస్థ మరింత అధ్వానంగా ఉంటుంది. ఆ సమయంలో పూర్తిగా ఫోన్లు పనిచేయడం లేదు. జియో టవర్ బాగా పనిచేసినప్పటికీ రీచార్జ్ ధరలు అధికంగా ఉండడంతో గిరిజనులు బీఎస్ఎన్ఎల్ వైపే మొగ్గు చూపుతున్నారు. 80 రోజులకు బీఎస్ఎన్ఎల్ రీచార్జ్ రూ.485 కాగా.. అదే జియో 30 రోజులకు రూ.350 ఉంటుంది. బీఎస్ఎన్ఎల్ రీఛార్జ్ చేసుకున్నా నెట్‌వర్క్ పని చేయకపోవడంతో నెలవారీ రీచార్జ్ వృథా అవుతుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో బీఎస్ఎన్ఎల్ టవర్ల వివరాలు

- పాడేరు మండలంలో 26 పంచాయతీలకు మొత్తం 60 బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్ టవర్లు ఉన్నాయి. పూర్తిగా అడవి ప్రాంతం కావడంతో టవర్ నిర్మాణం చేపట్టినప్పటికీ సిగ్నల్ రావడం లేదు.
- జి.మాడుగుల మండలంలో 17 పంచాయతీలు ఉన్నాయి. ఇవి ఆంధ్ర ఒడిశా సరిహద్దుకు ఆనుకొని గిరిజన గ్రామాల్లో ఎక్కువగా 59 టవర్ల నిర్మాణం చేపట్టారు. సక్రమంగా పనిచేయకపోవడంతో ఇతర నెట్‌వర్క్‌లపై గిరిజనులు ఆధారపడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.
- కొయ్యూరు మండలం పూర్తిగా అటవీ ప్రాంతం. గత ఐదేళ్ల కిందట వరకు ఈ ప్రాంతంలో మండల పంచాయతీ కేంద్రంలో ఐదారు టవర్లు ఉండేవి. గత ప్రభుత్వంలో ఏజెన్సీలో కోట్ల రూపాయలు వెచ్చించి సంబంధిత సెల్ టవర్ సంస్థలతో అధికారులు మాట్లాడి సమాచార వ్యవస్థ బలోపేతం అయ్యేందుకు అనేక టవర్ల నిర్మాణం చేపట్టారు. 33 పంచాయతీల్లో 73 బీఎస్ఎన్ఎల్ టవర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ టవర్లు కూడా అంతంత మాత్రంగా సేవలు అందిస్తున్నాయి.
- చింతపల్లి మండలంలో 17 పంచాయతీల్లో 71 బీఎస్ఎన్ఎల్ టవర్లు ఉన్నాయి. గతంలో మండల కేంద్రంలో ఒక టవర్ మాత్రమే ఉండేది. అలాంటిది గత మూడేళ్లలో చాలా టవర్ల నిర్మాణం జరిగింది. అయినా 4జీ సేవలు అందడం లేదు.
- జీకే వీధి మండలంలోని 16 పంచాయతీలు పూర్తిగా ఒడిశా సరిహద్దులో ఉన్నాయి. ఎక్కువగా 80 టవర్ల నిర్మాణం జరిగింది. ఇందులో 4జీ, 2జీ నెట్‌వర్క్ ఉన్నాయి. కానీ సక్రమంగా పనిచేయవు. సిగ్నల్స్ రాకపోవడం వంటి సమస్యలు రోజూ వేధిస్తున్నాయి. బీఎస్ఎన్ఎల్ అధికారులు ప్రైవేట్ సంస్థలకు లబ్ధి చేకూరేలా ఫ్రీక్వెన్సీని తగ్గించడం వల్ల బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ సక్రమంగా రావడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచాలని కోరుతున్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉన్నా ఎయిర్‌టెల్ వాడుతున్నా..

దుప్పులవాడ సమీపంలో చల్లని శిల్ప వద్ద ఏడాది కిందట బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణం జరిగింది. రెండు నెలలు బాగా పనిచేసింది. ఆ తర్వాత సిగ్నల్ సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. దీంతో ఎయిర్‌టెల్ వాడవలసిన పరిస్థితి వచ్చింది. – వినోద్, దుప్పులవాడ

ఆన్‌లైన్ సేవలకు అంతరాయం



ఏజెన్సీలో అన్ని చోట్లా బీఎస్ఎన్ఎల్ టవర్లు 4జీ నెట్‌వర్క్‌తో ఉన్నాయి. అయినా సక్రమంగా పని చేయకపోవడంతో ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలుగుతోంది. దీంతో తప్పక అధిక రేట్లు ఉన్న జియో నెట్‌వర్క్ రీచార్జ్ చేయించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది.
– మూర్తి, సీలేరు, ఇంటర్నెట్ షాపు నిర్వాహకుడు

'వైద్య సేవల్లో ప్రభుత్వం విఫలం


కిండ్ర గ్రామంలో జ్వర పీడితులతో మాట్లాడుతున్న పౌర హక్కుల కమిటీ సభ్యులు

రాజవొమ్మంగి : మండలంలోని లాగరాయి, కిండ్ర, లబ్బర్తి గ్రామాల్లో రెండు, మూడు నెలలుగా గిరిజనులు జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నవారికి సకాలంలో చికిత్స అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందని పౌర హక్కుల సంఘం సభ్యులు ఆరోపించారు. మంగళవారం పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు, అడ్వకేట్‌లు సిద్ధార్థదొర, వరప్రసాద్ ఆ మూడు గ్రామాల్లో పర్యటించారు. చికెన్‌గున్యా, కీళ్ళ నొప్పులు తదితర రుగ్మతలతో బాధపడుతు్న రోగులను నేరుగా కలసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిట్టిబాబు విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు కనీస వైద్య సదుపాయాలు కల్పించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. విషజ్వరాలను సకాలంలో గుర్తించడంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించందన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో ఆయా గ్రామాల్లో రెండు చికెన్‌గున్యా కేసులను గుర్తించారని, ఇటీవలే జగజ్జనని అనే గృహిణి జ్వరానికి చికిత్స పొందుతూ మరణించిందని, అయినా పరిస్థితులను అదుపులోకి తీసుకురాలేకపోయారని ఆయన ధ్వజమెత్తారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఆదివాసీలను మోసం చేస్తున్న వ్యక్తిపై చర్యలకు డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న కుంజా శ్రీను

ఎటపాక: జామాయిల్ సాగు పేరుతో ఆదివాసీలను మోసం చేస్తూ గిరిజనుల మధ్య వివాదాలు సృష్టిస్తున్న గిరిజనేతర రైతుపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. మంగళవారం ఎటపాకలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1/70 చట్టానికి విరుద్ధంగా ఏజెన్సీలో ఆదివాసీ భూముల్లో గిరిజనేతరుడు జామాయిల్ సాగు చేస్తున్నారన్నారు. ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నందిగామ గ్రామానికి చెందిన ఓ రైతు గిరిజనులకు అప్పుగా కొంత నగదు ఇచ్చి అవి తిరిగి తీర్చలేని ఆదివాసీలను బెదిరించి వారి భూములు తీసుకుని జామాయిల్ సాగు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో కుసుమనపల్లి ప్రాంతంలో 150 ఎకరాలు సాగుచేసి అక్కడి ఆదివాసీలను మోసం చేశారన్నారు. దీనిపై విచారణ చేపట్టి సదరు వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టీపీ వీడు సర్పంచ్ మోసం రాజులు, రాజమ్మ, సొందె నాగేశ్వరావు, రమణ, సత్యమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

దోమ తెరల పంపిణీ


కిండ్ర గ్రామంలో జ్వరపీడితులకు దోమతెరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

రాజవొమ్మంగి: మండలంలోని జ్వరపీడిత గ్రామాలైన లాగరాయి, లబ్బర్తి, కిండ్ర గ్రామాల్లో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి మంగళవారం దోమతెరలు పంపిణీ చేశారు. ఇటీవల ఈ ప్రాంతానికి వచ్చిన జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రతి ఇంటికి దోమ తెరలు అందజేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. ఈ మేరకు సరఫరా అయిన దోమతెరలను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందజేశారు.

అరకు ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు


రక్త పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ టౌన్: కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అరకు ఏరియా ఆస్పత్రిలో మంగళవారం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సూపరింటెండెంట్ ఎల్.రాము పర్యవేక్షణలో రక్త పరీక్షలతో పాటు వైద్యం చేయించుకుని పలువురికి ఆదర్శంగా నిలిచారు. ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలపై ఓ నమ్మకం కలిగించారు.

రహదారి నిర్మాణం కోసం వినతి

శరభగుడ గ్రామం నుంచి ఎన్టీఆర్ క్రీడా మైదానం వరకు రహదారి నిర్మించాలని కోరుతూ గిరిజనులు ఎమ్మెల్యేకు తన క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. శరభగుడ నుంచి ఎన్టీఆర్ క్రీడా మైదానం వరకు సుమారు 500 మీటర్లు మట్టి రోడ్డు ఉందని, వర్షా కాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు బురదలో రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కోసంగూడకు తీరనున్న రహదారి సమస్య


కోసంగూడ నూతన రహదారి కోసం కొలతలు తీస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ కోసంగూడ గ్రామానికి త్వరలో రహదారి సమస్య తీరనుంది. పీఆర్ ఉన్నతాధికారుల ఆదేశాలతో మంగళవారం ఇంజినీరింగ్ అధికారులు, వైఎస్సార్‌సీపీ మండల నేత వంతాల మోహన్ ఆధ్వర్యంలో బాధిపుట్టు నుంచి కోసంగూడ వరకు సుమారు 2 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం కొలతలు తీశారు. బీటీ రోడ్డుతో పాటు కల్వర్టులకు నివేదిక తయారు చేశారు. పలుమార్లు కోసంగూడ రహదారి కోసం పాడేరులో జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోల దృష్టికి తీసుకువెళ్లి, దరఖాస్తులు చేయడంతో అధికారులు స్పందించారు. సచివాలయం ఇంజినీరింగ్ అధికారులు వరుణ్‌బాబు, వాసులు వచ్చి కొలతలు తీశారు. త్వరలోనే రహదారి సమస్య తీరనుండడంతో వార్డు మెంబర్ నాగేశ్వరరావు, కోసంగూడ గ్రామ గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


జోలాపుట్టులో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచులు, ఎంపీటీసీ, నాయకులు

ముంచంగిపుట్టు: మండలంలోని దొడిపుట్టు పంచాయతీ గొత్తురుముండ గ్రామంతో పాటు జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో రూ.10 లక్షల జెడ్పీ నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచులు నీలకంఠం, వసంత, ఎంపీటీసీ కమల, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, తదితరులు కొబ్బరికాయలు కొట్టి సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రత్యేక చొరవతో దశల వారీగా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయని సర్పంచులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ జగబంధు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సన్యాసిరావు, వార్డు మెంబర్లు బుద్దు, శుక్ర, మండల నేతలు జె.వి.వి.ఎస్.మూర్తి, సులేమాన్, భాగత్‌రాం, శివ, జగత్రాయ్, ప్రకాశ్, రామరాజు, పరదేశి, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


వెలుగు వీవోఏలకు బయోమెట్రిక్ పరికరాలు అందజేస్తున్న అధికారులు

రాజవొమ్మంగి: స్త్రీనిధి రుణాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, అలాగే తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని స్త్రీనిధి మేనేజర్ కృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన వీవోఏల(బుక్‌కీపర్స్) సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి ఈ ఏడాది రూ.6 కోట్ల మేర స్త్రీనిధి రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గతేడాది రూ.3 కోట్లు మాత్రమే ఇచ్చామన్నారు. మండలంలోని పలు గ్రామ సమాఖ్యలు రుణాలు తిరిగి చెల్లించడంలో వెనుకబడ్డాయన్నారు. అప్పు తీసుకొన్న వారు సకాలంలో చెల్లిస్తే మిగతా సంఘాలకు రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. రాజవొమ్మంగిలో రూ.25.5 లక్షల మేర బకాయిలు ఉన్నాయన్నారు. త్వరగా తీసుకొన్న అప్పులు చెల్లిస్తే ప్రతి సంఘానికి రూ. 5 నుంచి రూ.10 లక్షల వరకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తామన్నారు.

బయోమెట్రిక్ పరికరాలు అందజేత

స్త్రీనిధి రుణాలు త్వరితగతిన మంజూరు చేసేందుకు, వసూలు అయిన సొమ్ము తిరిగి స్త్రీనిధికి మొబైల్ యాప్ ద్వారా జమ చేసేందుకు అవసరమైన బయోమెట్రిక్ పరికరాలను మేనేజర్ కృష్ణ వీవోఏలకు అందజేశారు. మండలంలో 59వీవోలు(గ్రామ సమాఖ్యలు) ఉండగా అన్ని వీవోలకు ఈ నూతన డివైజ్‌లు అందించారు. ఎంఎంఎస్ లీడర్లు బాలమ్మ, దేవి, ఏపీఎం రామాంజనేయులు, ఎఫ్‌పీవో గణపతి, సీసీలు రామకృష్ణ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ బాబు మోసాలు వివరించండి

- ఎమ్మెల్సీ అనంతబాబు పిలుపు
- తోటకూరపాలెంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'


తోటకూరపాలెంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభలో మాట్లాడుతున్న అనంతబాబు


సభకు హాజరైన గ్రామస్తులు

వై.రామవరం: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలపై ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయ్ భాస్కర్(అనంతబాబు) పిలుపునిచ్చారు. మండలంలోని చవిటిదిబ్బలు సచివాలయం పరిధిలోని తోటకూరపాలెం గ్రామంలో మంగళవారం ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో అనంతబాబు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఎన్నికల ముందు ఎన్నెన్నో హామీలిచ్చి గద్దెనెక్కాక కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా గ్రామస్థాయిలో కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి పలు పథకాలను అమలు చేయకుండానే అన్నీ ఇచ్చేశామంటూ కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని పథకాలను అందించామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొత్తవారికి పథకాలు ఇవ్వకపోగా, అర్హులైన లబ్ధిదారులకు పథకాలను తొలగిస్తుందని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో 60 లక్షల మంది తల్లులకు అమ్మఒడి పథకం సొమ్ములు అందజేయగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం తల్లికి వందనం పథకం పేరుతో లబ్ధిదారులను కుదించిందన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఎంతో మంది ఏజెన్సీ రైతులకు కొండపోడు పట్టాలిచ్చామని, కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెండింగ్‌లో ఉన్న కొండపోడు పట్టాలను గిరిజన రైతులకు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల విషయంలో ప్రొటోకాల్ పాటించకుండా చిన్నచూపు చూస్తున్న అధికారులను నిలదీయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఏసమస్య వచ్చినా, ఎవరైనా వేధించినా తన దృష్టికి తీసుకొస్తే అండగా ఉండి న్యాయం కోసం పోరాడతానని అనంతబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్య క్రమంలో జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, భారీ ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

లార్వా నివారణకు గంబూషియా చేపల విడుదల


చెరువులో గంబూషియా చేపలు వదులుతున్న వైద్య సిబ్బంది

ఎటపాక: దోమల లార్వా నివారణ గంబూషియా చేపలతోనే సాధ్యమని నెల్లిపాక పీహెచ్‌సీ వైద్యుడు దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని మూడు చెరువుల్లో 900 గంబూషియా చేపలు వదిలారు. ఈ చేపలు లార్వాను ఆహారంగా తీసుకుని సహజ సిద్ధంగా దోమలను తగ్గిస్తుందని ఆయన చెప్పారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మలేరియా నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజేష్, గంగరాజు, లక్ష్మణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత


కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

అరకులోయటౌన్: ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల రసాయన శాస్త్రం విభాగం, జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు ఎం.అనితకుమారి, ఎస్.సురేష్, ఎన్ఎస్ఎస్ పీవోలు వై.విజయలక్ష్మి, పి.నాగబాబు, డాక్టర్ ఎం.కృష్ణ మోహన్, గణేష్, బి.లచ్చన్న, ఎస్.రాజు, సోంబాబు, కె.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలి


యూరియా పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమేష్‌బాబు, ఎంపీటీసీ వంశీ

రంపచోడవరం: రంపచోడవరం మండలం ముసురుమిల్లి రైతు సేవా కేంద్రంలో మంగళవారం సర్పంచ్ కోసు రమేష్‌బాబు, ఎంపీటీసీ కుంజం వంశీలు రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో రైతులకు పది టన్నులు యూరియా కావాలని ప్రతిపాదనలు పంపిస్తే 3 టన్నులు మాత్రమే వచ్చిందన్నారు. రెండో విడతలో పంపిస్తామని అధికారులు చెబుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు సత్యనారాయణ, పీసా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి శివశంకర్, రాంబాబు, హెచ్‌వో సౌజన్య, వైఎస్సార్ సీపీ నాయకుడు బొబ్బా శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు


డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ హిమగిరి

అరకులోయటౌన్: యువత మత్తు పదార్థాలు, గంజాయి, నాటుసారా వంటి జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని అరకులోయ సీఐ ఎల్.హిమగిరి కోరారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో సీ–కాలనీలో ఇంటింటికి వెళ్లి డ్రగ్స్, గంజాయి, నాటు సారాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిరుద్యోగ యువత డ్రగ్స్, గంజాయికి బానిసై బడా వ్యాపారుల మాయమాటలకు నమ్మి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువకులు తల్లిదండ్రులు చెప్పిన మాటలు నమ్మి బుద్ధిగా చదువుకొని, ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.